ప్రజాశక్తి
సోమవారం 17, ఏప్రిల్ 2023
5
అనంతపురం



## ప్రశాంత స్పాట్ వాల్యుయేషన్‌కు సహకరించండి : డిఇఒ

**అనంతపురంసిటీ :** పదో తరగతి స్పాట్ వాల్యూషన్‌కు ఉపాధ్యాయ సంఘాల నాయకులు సహకరించాలని డిఇఒ ఎం.సాయిరాం కోరారు. ఆదివారం నగరంలోని కెఎస్‌ఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ సంఘాలతో పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గోవిందనాయక్‌తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ పదో తరగతి రెగ్యులర్, ఓపెన్ స్కూల్ పరీక్షలు మొదటి రోజు మినహా మిగిలిన అన్ని రోజులు ప్రశాంతంగా జరిగాయన్నారు. ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఈనెల 19వ తేదీ నుంచి కెఎస్‌ఆర్ మహిళల పాఠశాలలో స్పాట్ వాల్యూషన్ ఉంటుందన్నారు. ఈ ప్రక్రియకి 1057 మంది టీచర్లను ఎఇలు, సిఇలుగా నియమించినట్లు తెలిపారు. సంబంధింత హెచ్‌ఎంలు ఆ టీచర్లను వెంటనే రిలీవ్ చేయాలని, ఏదైనా సమస్య ఉంటే డిఇఒ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం డిప్యూటీ డిఇఒ పద్మప్రియ, జిల్లా విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి

# చైతన్య పరిచే సాహిత్యం అవసరం

### ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి

**ప్రజాశక్తి-అనంతపురం**

'సాహిత్యమైన మనిషిని చైతన్యపరచి ముందుకు నడిపించాలని, నిన్నటి కంటే నేడు.. నేటి కంటే రేపు సమాజం, మనిషి ఉన్నతంగా అభివృద్ధి చెందేటట్లు సాహిత్యం ప్రధాన భూమిక పోషించాలని, మన ఆలోచనలను అర్థం చేసుకోవడానికి జీవితాన్ని చైతన్య పరచుకోవడానికి సాహిత్యం ఎంతో అవసరం ' అని వక్తలు కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం అనంతపురం జిల్లా శాఖ నిర్వహణలో నందవరం కేశవరెడ్డి రచించిన కాంతి పూలు ఆవిష్కరణ సభ స్థానిక ఎన్జీవో హోంలో ఆదివారం నిర్వహించారు. ఈ సభకు అరసం అనంతరం జిల్లా శాఖ అధ్యక్షులు బి.ఈశ్వర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేశవరెడ్డి నిరంతరం సాహితీ కృషి చేస్తున్నారని కొనియాడారు ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించిన ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి ప్రసంగిస్తూ.. కాంతిపూలు పుస్తకం చదివితే మనిషి నైతికంగా ఎలా జీవించాలో తెలుస్తుందని అన్నారు. ఈ పుస్తకం నిండా మనిషి సంపూర్ణంగా జీవించడం ఎలాగో తెలియజేసే విషయాలు ఉన్నాయన్నారు. విశిష్ట అతిథులు డాక్టర్ శాంతి నారాయణ, బండి నారాయణస్వామి ప్రసంగిస్తూ.. జీవితం మనిషిని ఉన్నత మానవుడిగా తీర్చిదిద్దడమే కాక మొత్తం మానవజాతి చైతన్యాన్ని ఉన్నతీకరించగల శక్తి సామర్థ్యాలు కలిగి ఉంటుందన్నారు. అదే జీవితం ఇలాంటి జీవిత రహస్యాలను ఈ కావ్యం తెలియజేస్తుందని కొనియాడారు. కాంతిపూలు పుస్తకాన్ని సమీక్ష చేసిన తూముచెర్ల రాజారాం ప్రసంగిస్తూ ఈ కావ్యంలో 29 వ్యాసాలు ఉన్నాయన్నారు. ప్రతి వ్యాసం దేనికదే ప్రత్యేకతతో పాఠకుల్ని చదివించే లక్షణం కలిగివుందన్నారు. తరిమెల అమరనాథ్‌రెడ్డి, డాక్టర్ జగర్లపూడి శ్యామసుందర శాస్త్రి తదితరులు మాట్లాడుతూ.. అరసం అన్నవరం జిల్లా శాఖ కార్యవర్గ సభ్యులు కాంతి పూలు రచయిత నందవరం కేశవరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాధేయ, అరసం అనంతరం జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ నానీల నాగేంద్ర, ఆకుపచ్చ వెంకటేశులు, ఏలూరు యంగన్న, చంద్రశేఖర శాస్త్రి, నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ డివిజనల్ మేనేజర్ ఎ. ఓబుళపతి, డాక్టర్ తన్నీరు నాగేంద్ర, పూజారి ఈరన్న, కొత్తపల్లి సురేష్, మధుర శ్రీ, డాక్టర్ జన్నే ఆనంద్ కుమార్, చెట్ల ఈరన్న, నరసిరెడ్డి, వన్నప్ప, డాక్టర్ జూటూరు షరీఫ్, రియాజుద్దీన్, డాక్టర్ అప్పిరెడ్డి హరినాథ్‌రెడ్డి, ఆదిఆంధ్ర తిప్పేస్వామి, ఆర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కందుకూరి వీరేశలింగం పంతులుకు నివాళి అర్పిస్తున్న దృశ్యం

# గొప్ప సంఘ సంస్కర్త కందుకూరి

### ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

సమాజంలో మూఢనమ్మకాలు, బాల్య వివాహాల నిర్మూలన, వితంతువులకు వివాహాల కోసం, మహిళల విద్యాభివృద్ధికి చైత్యన్యం కల్పిస్తూ సమాజాన్ని మార్పు దిశగా అడుగులు వేయించిన గొప్ప సంఘ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి, సాహితీ వేత్త కందుకూరి వీరేశలింగం పంతులు అని ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి అన్నారు. ఆదివారం ఐద్వా ఆధ్వర్యంలో కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి వేడుకలు గణేనాయక్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. కందుకూరి వీరేశలింగం పంతులు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి మాట్లాడుతూ సమాజంలో మూఢనమ్మకాలను నిర్మూలనకు పోరాడిన మహనీయుడు అన్నారు. మహిళలు చదువుకోవాలని చైతన్యం నింపిన గొప్ప సంఘ సంస్కర్త అన్నారు. వీరేశలింగం సతీమణి రాజ్యలక్ష్మితో వితంతు శరణాలయం స్థాపించి సేవలు అందించారని కొనియాడారు. వారు చూపించిన ఆదర్శ భావాలతో సమాజం మెలగాలన్నారు. మూఢనమ్మకాలు నిర్మూలించాలని, మహిళలపై హత్యలు, దాడులు నిర్మూలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్యామల, రాజేశ్వరి, కోశాధికారి చంద్రిక, జిల్లా ఉపాధ్యక్షుల రామాంజినమ్మ, మహిళలు రజియా, మాధవి, మానస, సునంద, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ తోఫా పంపిణీ

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**


రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్

టిడిపి మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గౌస్‌మొద్దీన్ ఆధ్వర్యంలో రంజాన్ పండుగ సందర్భంగా పేద ముస్లిములకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఆదివారం సాయి నగర్‌లోని ఆయన నివాసంలో తోఫా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగ సందర్భంగా పేదలకు తోఫా పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఏటా రంజాన్‌ను పురస్కరించుకుని తోఫా ఇచ్చి వారి ఆశీర్వాదం పొందుతున్నట్లు తెలిపారు. తోటి వారికి ఈ విధంగా సహాయం చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి తెలుగు యువత నాయకులు లింగారెడ్డి, బాలక్రిష్ణ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# అధిక ధరలతో బెంబేలు..!

**రంజాన్ పండుగ అని సుబహాన్ తన మూడేళ్ల కూతురికి దుస్తులు కొనేందుకు కుటుంబ సభ్యులతో కలిసి హిందూపురం పట్టణం ముక్కడిపేటలో ఒక వస్త్ర దుకాణానికి వెళ్లాడు. కనీసం రూ.600 విలువ కూడా చేయని ఒక గౌను రూ.2500 అని వ్యాపారి చెప్పడంతో ఆర్థిక స్థోమత లేక వెనక్కి వచ్చాడు.**

**దిన కూలి చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నూరుల్లా తన 15 సంవత్సరాల కూతురు కోసం ఒక డ్రెస్ కొనడానికి షాప్‌కి వెళ్లాడు. రూ.800 విలువ కూడా చేయని డ్రస్ రూ.4 వేలు అని వ్యాపారి చెప్పడంతో అతను ఒక్కసారిగా కంగుతిన్నాడు. చివరకు రూ.3 వేలు ఇస్తామని చెప్పినప్పటికీ వ్యాపారి ఇవ్వలేదు. ఇలా ఒక్క సుభాన్, నూరుల్లాలే కాదు ఎంతో మంది దినసరి కూలీలు, మెకానిక్‌లు, ఇతర వృత్తులు చేసుకునే వారు పడుతున్న బాధలు ఇవి.**

### వ్యాపారులు నిర్ణయించిందే ధర
### మామూళ్ల మత్తులో వాణిజ్య, తూనికలు, కొలతల శాఖ అధికారులు

**ప్రజాశక్తి-హిందూపురం**

పండుగలు ఏ సమాజిక వర్గాల వారికి వచ్చినా చాలా సందడిగా చేసుకుంటారు. ముఖ్యంగా మన ప్రాంతాల్లో హిందూ సోదరులకు ఉగాది, ముస్లిం సోదరులకు రంజాన్ పెద్ద పండుగలు. ఈ పండుగల్లో కూలి నాలి చేసుకుని జీవనం సాగించే వారు సైతం వారికి లేకున్నా తమ బిడ్డలకు అయినా నూతన వస్త్రాలు కొని ఇవ్వాలని అనుకుంటారు. అయితే వస్త్ర దుకాణాకు బట్టల కోసం వెళ్లి ధరలు అడిగితే, ఒక్క సారిగా వినియోగారులకు గుండె పోటు వచ్చినంత పని అవుతోంది. వ్యాపారులు నిర్ణయించే ధర, ఆ వస్త్రలపై తయారీదారులు నిర్ణచించిన ధర ఉండదు. వ్యాపారులు నిర్ణయించిన ధరలే ఉంటాయి. ఎవరైనా నిర్ణీత ధరలు లేవని అడిగితే 'ఇష్టం ఉంటే తీసుకోండి.. లేదా వెళ్లండి.. మేము నిర్ణయించే ధర' అంటూ వ్యాపారులు చెబుతున్నారు. వారికి ఎదురు చెప్పలేక.. ఇంట్లో భార్యకు సర్దిచెప్పలేక.. ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక వ్యాపారులు చెప్పిన ధరలకే వినియోగదారులు కొంటున్నారు. కనీసం కొన్న వాటికి వ్యాపారులు బిల్లులు సైతం ఇవ్వడం లేదు. మొత్తం అంతా జీరో వ్యాపారమే. హిందూపురం పట్టణంలోని ఒక్క ముక్కడిపేటలోనే రంజాన్ నెలలో రూ.కోటికి పైగా వ్యాపారాలు జరుగుతున్నాయి. ఇక మొత్తం పట్టణంలో ఉన్న వస్త్ర దుకాణాల్లో పరిశీలన చేస్తే ఇది రూ.2 కోట్లకు పైగా జరుగుతుంది. ప్రతి దుకాణదారుడు రోజుకు రూ.లక్షకు పైగా వ్యాపారాలు చేస్తున్నారు. వారికి బిల్లు బుక్‌లు సైతం ఉండవు. ఇంత పెద్ద ఎత్తున జీరో వ్యాపారాలు జరుగుతున్నా కూత వేటు దూరంలో


హిందూపురం పట్టణంలోని ముక్కడిపేటలో వెలసిన వస్త్ర దుకాణాలు

ఉన్న వాణిజ్య శాఖ అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు.

**ఆ రెండు శాఖలే కీలకం..**

వస్త్ర దుకాణాలతో పాటు ప్రతి వ్యాపారానికి ప్రధానంగా తూనికలు కొలతల శాఖ, వాణిజ్య శాఖ అధికారులే కీలకం. ఇందులో తూనికలు కొలతల శాఖ అధికారులు వస్త్ర దుకాణాలతో పాటు ఇతర దుకానాలను తనఖీ చేయాలి. నిర్ణీత ధరలకు విక్రయిస్తున్నా రా.. అధిక ధరలకు విక్రయిస్తున్నారా.. అని చూసి, నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు ఇటువంటి కేసులు అధికారులు నమోదు చేయడం లేదు. కేవలం దీపావళి పండుగ సమయంలో మాత్రం ఎంజిఎం మైదానంలో తూనికలు కొలతల శాఖ అధికారి కనిపించి, రెండు నుంచి మూడు దుకాణాలను తనిఖీ చేస్తున్నారు. కేసులు నమోదు చేసి వారిచ్చే మామూళ్లు తీసుకుని పోతారు. ఇక వారు కనిపించేది మళ్లీ దీపావళి పండుగకే. ఈ శాఖ ఇలా ఉంటే వాణిజ్య శాఖ అధికారులు కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు బిల్లులు తీసుకోవాలని వినియోగదారులకు మాత్రమే చెబుతారు. బిల్లులు ఇవ్వని దుకాణాలపై మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోరు. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే జిఎస్‌టి ఉంది.. వ్యాపారులు కొనుగోలు సమయంలోనే పన్ను చెల్లిస్తారు..అని అంటున్నారు. అయితే జిఎస్‌టితో ఎంత కొనుగోలు చేశారు.. జిఎస్‌టి లేకుండా ఎంత కొనుగోలు చేశారు.. అన్నది మాత్రం చూడడం లేదు. ఈ రెండు శాఖల నిర్లక్ష్యానికి వినియోగదారులు అధిక ధరలతో బెంబేలెత్తున్నారు. ఇప్పటికైనా ఈ శాఖలు మామూళ్ల మత్తులో నుంచి బయటకు వచ్చి తనిఖీలు ముమ్మరం చేయాల్సిన అవసరం ఉంది.

# గ్రంథాలయాలకు పూర్వ వైభవం తేవడమే లక్ష్యం

### విలేజ్ డిజిటల్ లైబ్రరీల ఏర్పాటులో రాష్ట్రం ఆదర్శం
### జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్ పర్సన్ ఎల్ఎం.ఉమా మోహన్‌రెడ్డి

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

ఎన్నో సంవత్సరాల తరబడి భద్రపరచిన విజ్ఞాన సమాచారం, విజ్ఞాన సంపదను పాఠకులకు అందిస్తూ గ్రంథాలయాలకు పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యంగా వైసిపి ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థల ఛైర్మన్‌ల ఫోరం రాష్ట్ర అధ్యక్షురాలు, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్ పర్సన్ ఎల్ఎం.ఉమామోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాల్లోని గ్రంథాలయాల్లో మౌలిక వసతులు కల్పిస్తూ, పాఠకులకు అనువైన పుస్తకాలను గ్రంథాలయాల్లో అందుబాటులోకి తీసుకొచ్చి సేవలు పదిలం చేస్తున్నట్లు ఆమె తెలిపారు. గ్రంథాలయాల అభివృద్ధిపై ఆదివారం ఆమె ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో అనేక ఆసక్తికర విషయాలను వెల్లడించారు.

**ప్రశ్న : గ్రంథాలయాల సేవల నిర్వహణ ఎలా ఉంది ?**

**జవాబు :** అనంతపురం, శ్రీసత్యసాయి ఉమ్మడి జిల్లాల్లో డిజిటల్ లైబ్రరీతో పాటు 70 గ్రంథాలయాలు ఉన్నాయి. 10 గ్రామీణ గ్రంథాలయాలు, 70 బుక్ డిపాజిట్ సెంటర్‌లు ఉన్నాయి. తాను బాధ్యతలు చేపట్టిన తరువాత రూ.40 లక్షలతో పుస్తకాలు కొనుగోలు చేశాం. రూ.16 లక్షల విలువ గల కంప్యూటర్లు కొనుగోలు చేసి అందుబాటులోకి తెచ్చాం. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు అనుగుణంగా పుస్తకాలు అందుబాటులో ఉంచాం. పాఠకులు పెరిగేలా మెరుగైన సౌకర్యాలు కల్పించాం.




**ప్రశ్న : సిబ్బంది కొరత ఉందా? నూతన ఉద్యోగాలు కల్పించారా?**

**జవాబు :** సిబ్బంది కొరత కొంత ఉంది. తాను బాధ్యతలు చేపట్టిన తరువాత 13 పోస్టులు భర్తీ చేశాం. ఎప్పటి నుంచో కోర్టులో పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఈ ప్రభుత్వంలో అభ్యర్థులకు పోస్టులు ఇచ్చాం. కారుణ్య నియామకాల కింద 2 పోస్టులు భర్తీ చేశాం. సిబ్బంది సమిష్టిగా పని చేస్తూ పాఠకులకు సేవలు అందిస్తున్నారు

**ప్రశ్న : అభివృద్ధి పనులు చేపట్టారా ?**

**జవాబు :** జిల్లాలో మూడు గ్రంథాలయాలకు సొంత భవనాలు నిర్మాణం జరుగుతోంది. నార్పలలో రూ.40 లక్షల వ్యయంతో నూతన భవనాన్ని నిర్మిస్తున్నాం. అనంతపుం ఎంపీ తలారి రంగయ్య ఎంపీ నిధులు రూ.30 లక్షలు, శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఎమ్మెల్యే నిధులు రూ.10 లక్షలతో భవనాల నిర్మాణం జరుగుతోంది. కనగానిపల్లిలో రూ.40 లక్షలతో గ్రంథాలయ భవనం నిర్మిస్తున్నాం. బ్రహ్మసముద్రంలో రూ.30 లక్షలతో భవనం నిర్మించేలా స్థల సేకరణ కూడా చేశాం. 5 గ్రంథాలయాలకు మరమ్మతులు చేయాల్సి ఉంది. ప్రతిపాదనలు కూడా ప్రభుత్వం వద్దకు తీసుకెళ్లాం. త్వర్వలో ఆ పనులు కూడా ప్రారంభం అవుతాయి.

**ప్రశ్న : సెస్ బకాయిలు వసూలు జరుగుతోందా?**

**జవాబు :** ఉమ్మడి జిల్లాలో రూ.16 కోట్లు సెస్సు బకాయిలు రావాల్సి ఉంది. కొంత మేరకు వసూలు అవుతోంది. వచ్చిన సెస్సు మొత్తంలోనే ఉద్యోగులకు జీత భత్యాలు చేస్తున్నాం. ప్రభుత్వ శాఖలకు రావాల్సిన సెస్సు బకాయిలను కోర్టుకు వెళ్లి మరీ వసూలు చేసుకుంటున్నారు. గ్రంథాలయాలకు రావాల్సిన సెస్సుల చెల్లింపులో మాత్రం కొన్ని శాఖలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. అలాంటి శాఖల అధికారులకు జరుగుతున్న జాప్యంపై లెటర్లు పంపివున్నాం. త్వరలో చెల్లింపులు చేస్తామని అంటున్నారు. అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి సెస్ చెల్లింపులు చేస్తే బాగుంటుంది.

**ప్రశ్న : విలేజ్ డిజిటల్ లైబ్రరీలు మీ పరిధిలో ఉంటాయా ?**



**జవాబు :** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా గ్రామ, వార్డు సచివాలయానికి ఒక విలేజ్ డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేస్తోంది. వాటి నిర్వహణ బాధ్యతలు జిల్లా గ్రంథాలయాలకే అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విలేజ్ గ్రంథాలయాల బాధ్యత, భద్రత జిల్లా గ్రంథాలయ సంస్థకు ఉంటుంది. విలేజ్ లైబ్రరీలు అందుబాటులోకి వస్తే గ్రంథాలయాలకు పూర్వ వైభవం రావడం ఖాయం. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి తరువాత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గ్రంథాలయాలకు ప్రాధాన్యత ఇచ్చారు. దేశంలోనే విలేజ్ లైబ్రరీలు ఆదర్శంగా నిలువబోతున్నాయి. సమాజంలో రైతులు, విద్యార్థులు, యువతకు విజ్ఞానాన్ని పెంపొందించి విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణానికి ప్రభుత్వం బాటలు వేస్తోంది. అందులో తమవంతు కృషి అందించడం ఎంతో సంతోషంగా ఉంది. పాఠకుల ప్రశంసలు పొందడం అదృష్టంగా భావిస్తున్నాను.

# సమస్యల వలయంలో ఆత్మకూరు ఆసుపత్రి

### అంతంత మాత్రంగా రోగులకు వైద్యసేవలు - వైద్య సిబ్బంది, మందుల కొరత

**ప్రజాశక్తి-ఆత్మకూరు**

'పైన పటారం.. లోన లొటారం' అన్న చందాన మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో వైద్యసేవలు అందుతున్నాయని మండలవాసులు వాపోతున్నారు. అనంతపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి కూతవేటు దూరంలో ఉన్న ఆత్మకూరు మండల ప్రభుత్వ ఆసుపత్రిలో గతంలో 47 నుంచి 41 మంది సిబ్బంది వరకు అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందించేవారు. అయితే ప్రస్తుతం ఇద్దరు ప్రధాన వైద్యులతోపాటు హెడ్‌నర్సులు, నర్సులు, అందరూ కలిసిన 12 మంది సేవలు అందిస్తున్నారు. వారు అందిస్తున్న సేవలు కూడా అంతంత మాత్రమే అన్న విమర్శలు ఉన్నాయి. ఉన్న ప్రధాన వైద్యుడు వారంలో ఒక్కరోజు కూడా కేంద్రానికి రావడం లేదని స్థానికులు చెబుతున్నారు. ప్రశ్నిస్తే క్యాంపులో ఉన్నామంటూ సమాధానం ఇస్తున్నారు. మండల కేంద్రం ఆసుపత్రి నుంచి మెడికల్ కళాశాల సర్వజన ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసినప్పటికీ అందుకు తగ్గట్టుగా సిబ్బంది లేకపోవడం విచారకరం. కేవలం జూనియర్ డాక్టర్లతో ఇక్కడ వైద్యసేవలు పరిమితమయ్యాయి. టిడిపి హయాంలో మాజీమంత్రి పరిటాల సునీతమ్మ వైద్యసేవలు అందించేందుకు రూ.కోట్లు వెచ్చించి ప్రత్యేక భవన సముదాయం ఏర్పాటు చేశారు. ఈ భవనాలు నేటికీ వృథాగా ఉన్నాయి. మరోవైపు ఇటీవల కరోనా వ్యాధి నేపథ్యంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి లక్షలాది రూపాయలు వెచ్చించి కరోనా వ్యాధిగ్రస్తులకు గ్యాస్, తదితర పరికరాలను అందించారు. ఈ పరికరాలను కూడా ఏనాడూ ఉపయోగించిన పాపానపోలేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా గర్భవతులు, బాలింతలతో కిటకిటలాడే ప్రభుత్వ వైద్యశాలలో కనీసం శస్త్రచికిత్స చేసే వైద్యుడిని ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరం. అత్యవసర వైద్యసేవలు అందించాల్సిన సిటీ స్కానింగ్, ఎంఆర్ఐ స్కానింగ్ తదితర పరికరాలు అందుబాటులో లేకపోవడంతో జిల్లాకేంద్రానికి వెళ్లక తప్పడం లేదు. వీటికి తోడు మందుల కొరత వేధిస్తోంది. చిన్న పిల్లలు మొదలుకుని పెద్దల వరకూ అధిక శాతం మందులు బయటకు రాసిస్తున్నారన్నారు. ఉచిత సేవల కోసం వస్తే ఓపీ స్లిప్పుల్లో మందులు రాసిచ్చి బయట పంపడం ఏంటని రోగులు, బంధువులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో సౌకర్యాలు కల్పించి మెరుగైన వైద్యం అందించాలని స్థానికులు కోరుతున్నారు.



ఆత్మకూరు గ్రామీణ ఆరోగ్య కేంద్రం

# ప్రత్యేక పిల్లలకు ప్రోత్సాహం అందిద్దాం..

## ట్రైడ్ పాఠశాల యాజమాన్యం సేవలు అభినందనీయం - జెడ్పి ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

ప్రజాశక్తి-అనంతపురం

సమాజంలో మానవతా విలువలు పెంపొందించే దిశలో ట్రైడ్ పాఠశాల యాజమాన్యం విశేష కృషి అందిస్తోందని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. నగరంలోని తపోవనంలో ఉన్న ది రూరల్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్‌మెంట్ ట్రస్టు సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మానవతా విలువలు దిగజారుతున్న సమయంలో ట్రైడ్ సంస్థ అందిస్తున్న సేవలు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయన్నారు. సాటి మనిషిని బహుభారంగా భావిస్తున్న తరుణంలో ప్రత్యేక పిల్లలను ఆదరిస్తూ 25 సంవత్సరాలుగా సానుభూతికి దూరంగా ప్రోత్సాహం వైపు అడుగులు వేపిస్తున్న ఆ సంస్థ ట్రస్టు సభ్యులు ఔన్నత్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రత్యేకత అంటే మాటలలో కాదని చేతులో ఉందని నిరూపిస్తున్న సంస్థ సభ్యులు సుశీలమ్మ, దేశాయి గురుమూర్తిని అభినందించారు. ప్రత్యేక పిల్లల అభివృద్ధికి ప్రభుత్వ సహకారంతోపాటు తమ వంతు సహాయం సహకారం అందిస్తామని తెలిపారు. జిల్లా పరిషత్ నుంచి కేటాయించే నాలుగు శాతం నిధులను పరిశీలించి కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అబ్దుల్ రసూల్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రత్యేక ప్రతిభగల వారిపట్ల తగిన ప్రోత్సాహం అందించి అనేక కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. అర్హులు అర్హతను బట్టి ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంటే వారికి అందాల్సిన సంక్షేమం అందుతుందని తెలిపారు. జిల్లా పరిషత్ నుంచి నాలుగు శాతం నిధులు కేటాయిస్తే మరి కొంతమందికి లబ్ధి చేకూరుతుందని ఛైర్‌పర్సన్‌కి విన్నవించారు. ప్రభుత్వ ఆసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ ప్రత్యేక పిల్లల పట్ల తల్లితండ్రులు తగిన శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. వారి ఆరోగ్యం చైతన్యం పరివర్తనను పరిశీలిస్తూ తగిన శ్రద్ధ చూపిస్తే పిల్లల్లో మానసిక శారీరక శక్తిని మరింత అభివృద్ధి చేయవచ్చునని తెలిపారు. ప్రత్యేక పాఠశాలలో ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ద్వారా నేడు ఎంతో మంది పిల్లలు సమాజంలో స్వతహాగా తమ పనులు తాము చేసుకుంటున్నారన్నారు. పాఠశాల ట్రస్టీలు సుశీలమ్మ, గురుమూర్తి మాట్లాడుతూ జిల్లాలో 25 సంవత్సరాలుగా ఎంతో అంకితభావంతో ప్రత్యేక పాఠశాలను నడుపుటకు నిష్ణాతులైన సిబ్బంది శ్రేయోభిలాషులు తోడ్పాటు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా హోప్స్ సంస్థ పాఠశాల నిర్వహణకు బిల్డింగును అందించడం అభినందించదగ్గ విషయమన్నారు. అనంతరం ప్రత్యేక పిల్లలు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ ఛైర్మన్ గౌస్‌మొహిద్దీన్, పాఠశాల ప్రిన్సిపాల్ రమణమూర్తి, హరిప్రియ, అనురాధ ఫాతిమా, సావిత్రి, ఒలీబా, నిర్వాహకులు, సిబ్బంది సుధాకర్, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.




జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

## నేరాలు ఘోరాలు

### టిప్పర్ కింద పడి వ్యక్తి మృతి



మృతిచెందిన కామేశ్వర్

ఆత్మకూరు : మండల పరిధిలోని ఓ వ్యవసాయ పొలంలో ఆదివారం తెలుగువారుజామున టిప్పర్ కిందపడి కామేశ్వర్ (52) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు హిటాచి డ్రైవర్ చేస్తున్న కామేశ్వర్ ఆదివారం రాత్రి పని వెళ్లాడు. ఈనేపథ్యంలో టిప్పర్ కింద నిద్రిస్తుండగా గమణించని టిప్పర్ డ్రైవర్ కామేశ్వర్‌పై వెళ్లాడు. దీంతో కామేశ్వర్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకున్నట్లు ఎఎస్‌ఐ రవిప్రసాద్ తెలిపారు.

### మహిళ ఆత్మహత్యాయత్నం

గుత్తి : మండలంలోని ఉబిచెర్ల గ్రామానికి చెందిన ఓ మహిళ ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గ్రామానికి చెందిన లక్ష్మీదేవి తరచూ కడుపునొప్పి వస్తుండడంతో ఆ బాధను భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు.



శ్రమదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

## ఎన్ఎస్ఎస్ వాలంటరీల శ్రమదానం

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం విసి ఎం.రామకృష్ణారెడ్డి సూచనల మేరకు ఆకుతోటపల్లి పంచాయతీ పరిధిలోని ఎస్‌కెయు హెల్త్ సెంటర్ వద్ద ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ 1వ యూనిట్ పి.సత్యసౌమ్య ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రమదానం చేశారు. ఇందులో భాగంగా దాదాపు 50 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొని శ్రమదానంతోపాటు కెరీర్ అవేర్‌నెస్ మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. అలాగే ఇంటింటి సర్వేతోపాటు ప్లాంటేషన్, ఇతర కార్యక్రమాలు నిర్వహించన్నుట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సత్యసౌమ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ సోమ శేఖర్, ఎస్‌కెయు హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, బి.చైతన్య లక్ష్మీ, హెల్త్ సెంటర్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎస్‌కెయు పరిధిలోని అనంతపురం జెఎన్‌టియు డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 అధికారి నగరూరు రసూల్ ఆధ్వర్యంలో ఆదివారం బుక్కరాయసముద్రం మండలం దయ్యాలగుంటపల్లిలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హైస్కూల్ హెచ్ఎం కెఎస్ వసుంధర మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాజానికి సేవ చేయటం అలవర్చుకోవాలన్నారు. ఇలాంటి ప్రత్యేక శిబిరాలను ప్రభుత్వాలు ఏర్పాటు చేసి విద్యార్థుల్లో సేవా దక్పతాన్ని పెంపొందించడం చాలా మంచిదన్నారు. అనంతరం పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ ఛైర్మన్ కష్ణార్జున, క్లస్టర్ రీసోర్స్‌పర్సన్ శివారెడ్డి, నడిమి ఎర్రప్ప, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## దేవగిరిలో తాగునీటి సమస్య

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని దేవగిరి గ్రామంలో తాగునీటి సమస్య ఉధృతమైంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దాదాపు సంవత్సరం నుంచి గ్రామంలో ఉన్న ఓవర్ ట్యాంక్ పని చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య ఎక్కువైందని వాపోతున్నారు. తాగునీటి ట్యాంకు శిథిలావస్థకు చేరుకోవడంతో మరమ్మతులక గురైంది. ట్యాంకు ఎక్కే మెట్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. మరోవైపు గ్రామంలో నాలుగు బోర్లు ఉన్నా నీటి కొరత తీరడం లేదని అంటున్నారు. ఈనేపథ్యంలో వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్కడ కూడా విద్యుత్ సక్రమంగా ఉండటం లేదని అంటున్నారు. దీంతో పనులు మాని వ్యవసాయానికి విద్యుత్ వదిలినప్పుడు పొలాల వద్దకు వెళ్లి నీటిని తెచుకోవాల్సిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యుయు జెఇని వివరణ కోరగా గ్రామంలోని తాగునీటి ట్యాంకు మెట్లు వేయడానికి బడ్జెట్ లేదన్నారు. అయితే 9 గంటలు కొళాయిలకు నీళ్లు అందిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



పొలాల వద్ద నీటిని తెచ్చుకుంటున్న మహిళలు



దేవగిరిలో శిథిలావస్థకు చేరిన ఓవర్ ట్యాంకు

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు : విప్



కరపత్రం అందజేస్తున్న విప్ కాపు

రాయదుర్గం రూరల్ : వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు విప్ కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. మండల పరిధిలోని ఆవులదట్ల గ్రామంలో ఆదివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వం పథకాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం ఎంపిడిఒ కొండయ్య, వైసిపి నాయకులు నారాయణనాయక్, తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్యశిబిరం

పుట్లూరు : మండలంలోని తక్కళ్లపల్లి గ్రామ సచివాలయ వద్ద రుద్రశక్తి డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి, గుండె వైద్యశిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా నంద్యాల చెందిన శాంతిరామ్ మెడికల్ కళాశాల, జనరల్ ఆసుపత్రి వైద్యులు దాదాపు 120 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మహేశ్వర్, మాజీ సర్పంచి కొండారెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## 20 నుంచి సమ్మెటివ్ అసెస్మెంట్-2 పరీక్షలు : డిఇఒ

అనంతపురం సిటీ : జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో 1 నుంచి 9 వ తరగతి వరకు ప్రభుత్వం నిర్ధేశించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 20వ తేదీ నుంచి సమ్మెటివ్ అసెస్మెంట్-2 పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.సాయిరాం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయము 9 నుంచి 12 గంటల వరకు 9వ తరగతి పరీక్ష ఉంటుందన్నారు.

## వైఎస్ భాస్కర్‌రెడ్డి అరెస్టు అన్యాయం

ఉరవకొండ : వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ వైఎస్ భాస్కర్‌రెడ్డిని ఆదివారం అరెస్టు చేయడం అన్యాయమని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. భాస్కర్‌రెడ్డితోపాటు ఆయన కుమారుడు వైఎస్ అవినాష్‌రెడ్డి తనకు చాలాకాలంగా తెలుసు అన్నారు. అలాంటి మంచివారిని ఎలాంటి సంబంధం లేని వివేకానందరెడ్డి హత్యకేసులో ఇరికించడం బాధాకరమన్నారు. కొన్ని రాజకీయ అరాచక శక్తులు, పచ్చ మీడియా చేస్తున్న ఆరోపణలను మాత్రమే సిబిఐ పరిగణిస్తూ కేసును దర్యాప్తు చేయడం బాధాకరమన్నారు.

## అగ్ని ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి-అనంతపురం

అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం నగరంలోని పలు అపార్ట్‌మెంట్లలో అగ్నిమాపక సిబ్బంది ఆదివారం అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సహాయక అగ్నిమాపక జిల్లా అధికారి అశ్వర్థ మాట్లాడుతూ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా 3వరోజు యువజన కాలనీ, రామ్‌నగర్‌లోని వజ్రగిరి సన్‌రైజ్, ఎస్ఎల్ఎన్ఎస్ మధు వసంతం అపార్ట్‌మెంట్లు, అరవింద్‌నగర్‌లోని ఎంఎస్‌ఆర్, శ్రీసాయి అపార్‌మెంట్లలోనిప్రజలకు ఇళ్లల్లో జరిగే అగ్నిమాపక ప్రమాదాలపై కూలంకుశంగా వివరించారు. ముఖ్యంగా వంటింట్లో స్త్రీలు అగ్ని ప్రమాదాలను నియంత్రించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా మహిళలు వంటింట్లో వెలుతురు వచ్చేలా చూసుకోవాలని తెలిపారు వంటింట్లో గ్యాస్ స్టవ్ లను గ్యాస్ సిలిండర్లను జాగ్రత్తగా పరిశీలిస్తూ ఉండాలన్నారు. వంట వీధిలో అశ్రద్ధ లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎలాంటి అనుమానాలు ఉన్నా గ్యాస్ డీలర్లకు, గ్యాస్ హెల్ప్‌లైన్లకు తగిన సమాచారం అందించాలని సూచించారు. పేలుడు పదార్థాలను వంటగదికి దూరంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

## టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శికి సన్మానం



టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి ఆదినారాయణను సన్మానిస్తున్న నాయకులు

శింగనమల : టిడిపి అనుబంధ కమిటీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికైన ఎం.ఆదినారాయణను తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ బీసీ సామాజికవర్గం నాయీబ్రాహ్మణ కమ్యూనిటీకి చెందిన తనను బిసి సెల్ రాష్ట్ర కమిటీలోకి తీసుకోవడం సంతోషకరమన్నారు. తన ఎంపికకు కృషి చేసిన దండు శ్రీనివాసులు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. కాగా కష్టపడి పని చేసేవారికి టిడిపిలో ఎప్పుడూ స్థానం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కళ్లాయప్ప, తెలుగు రైతు పార్లమెంట్ కార్యదర్శి అనంతనేని చౌదరి, బీసీ సెల్ పార్లమెంట్ అధికార ప్రతినిధి బండి పరుశురాం, బిసి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు బెస్త నారాయణస్వామి, కాయల సురేష్, వాణిజ్య విభాగం పార్లమెంట్ కార్యదర్శి దేరంగుల శంకరయ్య, మైనార్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి మొహమ్మద్‌గౌస్, గడ్డం నారాయణ జడేజా రాజబాబు, మాజీ డీలర్ నల్లప్ప, రంగస్వామి, ఆకులేడు పవన్, తదితరులు పాల్గొన్నారు.

## వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-గుత్తి



క్రీడాకారులకు క్రీడాసామాగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం

గుత్తి ఉప కేంద్రాల్లో ఆర్డీటీ సంస్థ ప్రతి ఏటా నిర్వహించే వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీటీ గ్రాస్ రూట్ కో-ఆర్డినేటర్ యుగంధర్ రెడ్డి సూచించారు. గుత్తి ఆర్ఎస్ లోని రైల్వే ఇన్స్టిట్యూట్‌లో ఉన్న క్రికెట్ ఉపకేంద్రంలో క్రీడాకారులకు ఆదివారం క్రికెట్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి శిక్షణలో 8 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాల వయసు ఉన్న క్రీడాకారులు పాల్గొనాలన్నారు. సమ్మర్ క్యాంపులో కోచ్‌లు వద్ద క్రీడాకారులు మెళకువలను నేర్చుకుని క్రికెట్‌లో రాణించాలన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే ఆర్డీటీ లక్ష్యమన్నారు. క్రికెట్ సబ్ సెంటర్ల అన్నిటికీ జ్యోతి గ్రానైట్ ఎక్స్ పోర్ట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ క్రికెట్ కిట్లను స్పాన్సర్ చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ కోచ్‌లు యుగంధర్‌రెడ్డి, వంశీ, ఆర్.కుమార్ (జోషి), రఘు, కార్తీక్, ఈదుర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## 'మా నమ్మకం నువ్వే జగనన్న'

యాడికి : ఎమ్మెల్యే పెద్దారెడ్డి సూచన మేరకు మండల పరిధిలోని తూట్రాళ్లపల్లిలో ఆదివారం మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. ఇందలో భాగంగా వైసిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు సంక్షేమ పథకాలపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో తూట్రాళ్లపల్లి సర్పంచి సంజీవరాయుడు, ముత్యాలరెడ్డి, జెసిఎస్ శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## బాధితుల పట్ల మర్యాదగా వ్యవహరించాలి

### అనంతపురం రేంజ్ డిఐజి అమ్మిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ఎన్నో బాధలతో సమస్యలు చెప్పుకునేందుకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని అనంతపురం రేంజ్ డిఐజి ఆర్ఎన్.అమ్మిరెడ్డి సూచించారు. ఆదివారం రాప్తాడు పోలీసుస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పోలీసు సిబ్బంది పనితీరు, రికార్డులను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రిసెప్షన్ సెంటర్‌ను తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా ముందుగా గుర్తొచ్చేది పోలీసులు అన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజలకు సహాయం చేయాలన్నారు. అనంతరం మండల పరిధిలోని శాంతిభద్రతలు పరిస్థితి, ఫ్యాక్షన్, సమస్యాత్మక గ్రామాల్లోని తాజా పరిస్థితులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇటుకలపల్లి సిఐ మోహన్, రాప్తాడు ఎస్ఐ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసులతో మాట్లాడుతున్న డిఐజి అమ్మిరెడ్డి




## అనంత మార్కెట్‌లోకి యునోటెక్ బిల్డింగ్ ప్రాడక్టులు

### ఆథరైజ్డ్ డీలర్ జావిద్ అహ్మద్

ప్రజాశక్తి-అనంతపురం

భవన నిర్మాణ రంగంలో తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఉత్పత్తులను అందించేందుకు యునోటెక్ బిల్డింగ్ ప్రాడక్ట్స్ సంస్థ ముందుకొచ్చిందని సంస్థ అనంతపురం డీలరు, జావిద్ టైం వరల్డ్ అధినేత జావిద్ అహ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ యునోటెక్ బిల్డింగ్ ప్రాడక్ట్స్‌లో ఎసి బ్లాక్ జాయింట్ మోర్టర్ లైట్ వెయిట్, ఎకో ఫ్రెండ్లీ ఫాస్ట్ కన్‌స్ట్రక్షన్‌కు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. నమ్మకం నాణ్యతతోపాటు తరతరాలు నిలిచే విధంగా నిర్మాణ రంగంలో యునోటెక్ బిల్డింగ్ ప్రాడక్ట్స్ అందిస్తున్నట్లు తెలిపారు. తమ ఉత్పత్తులు అత్యధిక కాలం మన్నికతోపాటు తక్కువ ఖర్చు, నీటి ఆదా ఉంటుందన్నారు. రాయలసీమ జిల్లాల్లో వేగవంతంగా విస్తరిస్తున్న యునోటెక్ బిల్డింగ్ ప్రాడక్ట్స్ ప్రస్తుతం అనంతపురంలో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. యునోటేక్ ఎఎసి బ్లాక్స్ సాధారణం కన్నా 70 శాతం తక్కువ బరువు ఉంటాయన్నారు. అందువల్ల బీములు, ఫిల్లర్లకు కావాల్సిన కాంక్రీటు, స్టీలు 20 శాతం వరకూ ఆదా అవుతుందన్నారు. అంతేగాకుండా బ్లాక్స్ ఒకేసైజులో ఉండటం వల్ల గోడ నిర్మాణం, ప్లాస్టరింగ్ సమయంలో 70 శాతం వరకు ఆదా అవుతుందన్నారు. ఇసుక, సిమెంటు భారీగా తగ్గుతుందన్నారు. ముఖ్యంగా చదల వంటి వాటి నుంచి తమ ఉత్పత్తులు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అడ్డుకుంటాయని తెలిపారు. సాధారణ ఇంటి నిర్మాణంతో పోలిస్తే తమ సంస్థ ఉత్పత్తుల వాడటం వల్ల 33 శాతం నిర్మాణ ఖర్చు తగ్గుతుందన్నారు. ఉభయ జిల్లాల్లో యునోటెక్ బిల్డింగ్ ప్రాడక్ట్స్ కావాలంటే సెల్.. 98498 36063 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.



యునోటెక్ బిల్డింగ్ ప్రాడక్టు బ్రిక్స్‌తో కట్టిన నిర్మాణం, (ఇన్‌సెట్‌లో) ఆథరైజ్డ్ డీలర్ జావీద్ అహమ్మద్



మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు

## ఉపాధ్యాయులపై అక్రమ కేసులు ఎత్తేయాలి

### ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉపాధ్యాయ బదిలీలను చేపట్టాలని, సిపిఎస్ రద్దు కోసం పోరాడిన ఉపాధ్యాయులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని పెన్నహోబిలంలో జోనల్ బాధ్యులు సాకే భాస్కర్ ఆధ్వర్యంలో ఎపిటిఎఫ్ ఉరవకొండ జోనల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. సిఎం జగన్ ఎన్నికల ముందు సిపిఎస్ రద్దు చేస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చడంలో విఫలమయ్యారన్నారు. ఇప్పటికైనా సిఎం ఇచ్చిన మాటను నిలబెట్టుకుని సిపిఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న డిఎలను చెల్లించాలని, అడహక్ ప్రమోషన్లు పొందిన ఉపాధ్యాయులకు నెలకు రావాల్సిన రూ.2500 చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశులు, సిరాజుద్దీన్, జిల్లా గౌరవాధ్యక్షులు ప్రభాకర్, అసోసియేట్ జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమప్ప, రాష్ట్ర కౌన్సిలర్ రామకృష్ణతోపాటు ఉరవకొండ జోన్ పరిధిలోని ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు,